SK1 one NEWS HD

సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

జాతీయ తెలుగు దినపత్రిక

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 163 | పేజీలు : 04, వెల రూ. 2 రూ/ | మంగళవారం 01-09-2026

## తెలంగాణలో తొలిసారిగా కవచ్ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నాం




★తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో తాము పనిచేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

★కొత్త రైల్వే ట్రాక్‌లు, వాటిని ఉన్నతీకరణ చేసే విధంగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.

★మహబూబ్‌నగర్ జిల్లాలో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్న రైల్వేస్టేషన్ పనులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ పరిశీలించారు.

తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో తాము పనిచేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొత్త రైల్వే ట్రాక్‌లు, వాటిని ఉన్నతీకరణ చేసే విధంగా మిగతా 2లో

## వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేశామని

# డ్రామా ఆడారు

### వాళ్లు కూడా అంతే సంతోషంగా ఉండాలి

➢మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం

➢నాడు పునాది వేసిన తానే నేడు ప్రారంభించడం అదృష్టమన్న సీఎం చంద్రబాబు

➢గత ప్రభుత్వం ఫేక్ ప్రారంభోత్సవంతో ప్రజలను మోసం చేసిందని తీవ్ర విమర్శ

➢2028 నాటికి రెండో దశ పూర్తి చేస్తామని, మార్కాపురం జిల్లా ఇస్తామని హామీ

➢నదుల అనుసంధానంతోనే దేశంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారమన్న ముఖ్యమంత్రి

➢జగన్ హయాంలో వెలిగొండ ప్రాజెక్ట్‌కు గ్రహణం పట్టింది: సీఎం చంద్రబాబు

➢ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, కరవు నేలపై కృష్ణమ్మ పరుగులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను జాతికి అంకితం చేశారు.

➢నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేసి, ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలికారు.



ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, కరవు నేలపై కృష్ణమ్మ పరుగులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను జాతికి అంకితం చేశారు. నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేసి, ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలికారు. ఈ సందర్భంగా మిగతా 2లో

## "కరోనా కాలంలోనూ వైఎస్ జగన్ వెలిగొండ పనులను ఆపలేదు"



▶▶కరోనా కాలంలో కూడా వెలిగొండ ప్రాజెక్టు పనులను వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆపలేదని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు.

▶▶వెలిగొండ ప్రాజెక్టు ఘనత వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని చెప్పారు.

నెల్లూరు: కరోనా కాలంలో కూడా వెలిగొండ ప్రాజెక్టు పనులను వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆపలేదని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. మిగతా 2లో

# ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ కీలక భేటీ

●ఇరాన్ అధ్యకక్షుడు పెజెష్కియాన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు.

●కిర్గిస్థాన్‌లో జరుగుతున్న షాంఘై కో-ఆపరేషన్ సదస్సు సందర్భంగా వారిద్దరు భేటీ అయ్యారు.



బిష్కెక్: ఇరాన్ అధ్యకక్షుడు పెజెష్కియాన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. కిర్గిస్థాన్‌లో జరుగుతున్న షాంఘై కో-ఆపరేషన్ సదస్సు సందర్భంగా వారిద్దరు భేటీ అయ్యారు. రెండేళ్ల తర్వాత ఇద్దరు నేతలు మిగతా 2లో

# అమెరికాలో పెను విధ్వంసం.. వరదల్లో 20 మంది గల్లంతు!

●అమెరికాలోని ప్రసిద్ధ గ్రాండ్ కేనియన్ నేషనల్ పార్క్‌లో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి.

● కేవలం అరగంటలో కురిసిన భారీ వర్షంతో ఉప్పొంగిన వరద ప్రవాహానికి భారీ బండరాళ్లు, ఇనుప నిర్మాణాలు, ఇతర శిథిలాలు కొట్టుకుపోయాయి.



అమెరికాలోని ప్రసిద్ధ గ్రాండ్ కేనియన్ నేషనల్ పార్క్‌లో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. కేవలం అరగంటలో కురిసిన భారీ వర్షంతో ఉప్పొంగిన వరద ప్రవాహానికి భారీ బండరాళ్లు, ఇనుప నిర్మాణాలు, ఇతర శిథిలాలు కొట్టుకుపోయాయి. మిగతా 2లో

## భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం అందరి బాధ్యత



❊33శాతం పచ్చదనం తప్పనిసరి

❊ఏపీ ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

❊రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు.

❊కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని పిలుపునిచ్చారు.

ఏపీ ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త మిగతా 2లో

## ముసారాం బ్రిడ్జిని

# ప్రారంభించిన సీఎం రేవంత్

### మూసారం బాగ్ బ్రిడ్జిని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.

★ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, కాలేరు వెంకటేష్, శ్రీ గణేష్, నవీన్ యాదవ్, బలాల తదితరులు పాల్గొన్నారు.

★మూసీవరదలతో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ కొత్త బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు.

★మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.

★ఈ బ్రిడ్జిని రూ.52 కోట్ల వ్యయంతో 400 మీటర్ల పొడవుతో నిర్మించగా.. సీఎం నేడు (సోమవారం) ప్రారంభోత్సవం చేశారు.

★మూసీ నదిలో లక్షా యాభై వేల క్యూసెక్కుల వరద వచ్చినా ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పటిష్ఠంగా దీనిని నిర్మించారు.




మూసారం బాగ్ బ్రిడ్జిని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. సోమవారం అంబర్‌పేటలో సీఎం రేవంత్ దీనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, కాలేరు వెంకటేష్, శ్రీ గణేష్, నవీన్ యాదవ్, బలాల తదితరులు పాల్గొన్నారు. మూసీవరదలతో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ కొత్త బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు. లక్ష 50 వేల క్యూసెక్కుల వరద నీటిని తట్టుకునేలా బ్రిడ్జిని నిర్మించారు. మిగతా 2లో

## 'పుట్టింటి నుంచే బయటకు పంపారు'



⌘బీఆర్ఎస్ సస్పెన్షన్‌పై భావోద్వేగానికి గురైన కవిత

⌘సభలో కన్నీటి పర్యంతమైన కవిత

⌘"కవిత సీఎం" అంటూ కార్యకర్తల నినాదాలు

⌘కొత్త పార్టీ పెట్టడానికి కారణాలు వివరించిన కవిత

⌘తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో సమాధానమిస్తామని ప్రతిన

బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం తనను జైలుకు పంపారని పెద్ద నాయకులే చెప్పారని గుర్తు చేశారు. ఆ తర్వాత అదే పార్టీ నుంచి తనను బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. "నాతో ఎందుకు ఇలా చేయాలి?" మిగతా 2లో

## శిలాఫలకమే మీది..

# సంకల్పం, సమగ్ర నిర్మాణం వైఎస్సార్‌ది

### వెలిగొండలో చంద్రబాబు క్రెడిట్ చోరీపై వైఎస్ జగన్ ధ్వజం

●వెలిగొండకు ప్రాణం 37.587 కిలోమీటర్ల జంట సొరంగాలు

●కీలక జంట సొరంగాలు పూర్తి చేసిన ఘనత మా ప్రభుత్వానిదే

●ఇప్పుడు జరుగుతున్నది.. మీ క్రెడిట్ చోరీనే బాబూ

●మీరు, మీ అనుకూల మీడియా ఎంతగా చరిత్రను వక్రీకరించినా వాస్తవాలు మారవు

●ప్రచార ఆర్భాటాన్ని పక్కన పెట్టి.. నల్లమలసాగర్‌ను నింపి, రైతులకు సాగునీరు ఇవ్వాలి



వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ చరిత్రను మార్చేలా కొన్నాళ్లుగా సీఎం చంద్రబాబు చేస్తున్న ప్రచారం, ఎల్లో మీడియా చేస్తున్న హడావుడి.. క్రెడిట్ చోరీ యత్నాలపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. మిగతా 2లో

## తెలంగాణకు తీరని ద్రోహం

### - మన ప్రాజెక్టులు ఎండిపోతున్నాయ్



కృష్ణా నీటి దోపిడీపై సీఎం రేవంత్ మౌనం

కేఆర్ఎంబి ప్రేక్షకపాత్ర

తక్షణమే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించాలి

వెలిగొండకు కృష్ణా జలాల తరలింపుపై రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు విమర్శలు

తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా ఏపీకి నీళ్లు ఇస్తున్నారని ఆరోపణ

వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మిగతా 2లో

## రెండు దశల్లో నిర్మాణం..

# 2028 నాటికి తొలి దశ పూర్తి

### విశాఖకు ఏఐజీ.. రూ.2,000 కోట్లతో వెయ్యి పడకల హాస్పిటల్..

●విశాఖలో ఏఐజీ హాస్పిటల్ నిర్మాణానికి మంత్రి లోకేశ్ శంకుస్థాపన

●వెలిగొండపై మాటల యుద్ధం.. జగన్ కు లోకేశ్ కౌంటర్

●వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం... టీడీపీ, వైసీపీ విమర్శల పర్వం

●నీళ్లు లేకుండానే జగన్ ప్రాజెక్టును ప్రారంభించారంటూ లోకేశ్ ఎద్దేవా

●తొలి దశ పూర్తి చేసి నల్లమల సాగర్‌లోకి నీటిని విడుదల చేసిన చంద్రబాబు



ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంతో పాటు నెల్లూరు, కడప జిల్లాల్లోని పలు వెనుకబడిన ప్రాంతాల దశాబ్దాల కలను సాకారం చేసే వెలిగొండ ప్రాజెక్టు, మిగతా 2లో

సీమకిరణం నంద్యాల కర్నూలు
తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



# ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ కీలక భేటీ

సమావేశం కావడం ఇదే తొలిసారి. మోదీ-పెజెష్కియాన్ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు.సోమవారం సాయంత్రం రష్యా అధ్యకక్షుడు పుతిన్‌తో కూడా మోదీ సమావేశం కానున్నారు. కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు 6వ ప్రపంచ నోమాడ్ క్రీడల అధికారిక ప్రారంభ వేడుకలో పుతిన్ ఆయన పాల్గొంటారు.అర్మేనియా ప్రధాని నికోల్ పాషిన్యాన్‌తో కూడా మోదీ సమావేశమయ్యారు. "బిష్కెక్‌లో జరుగుతున్న ఎస్‌సీఓ సదస్సు సందర్భంగా అర్మేనియా ప్రధాని నికోల్ పాషిన్యాన్‌తో సమావేశం జరిగింది. రక్షణ, ఐటీ, అంతరిక్షం, విద్య, ఔషధాలు తదితర రంగాల్లో భారత్--అర్మేనియా సహకారం మరింత పెరగనుంది. రానున్న రోజుల్లో వాణిజ్యం, పెట్టుబడుల సంబంధాలను మరింత బలోపేతం చేస్తామని కూడా మేము విశ్వసిస్తున్నాం" అని మోదీ తెలిపారు.కాగా, కిర్గిజిస్థాన్ రక్షణ అధికారులు, కిర్గిజ్ రిపబ్లిక్ మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు సోమవారం ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన విషయాన్ని మీడియాకు తెలిపారు. భారత్--కిర్గిజిస్థాన్ మధ్య పెరుగుతున్న రక్షణ సంబంధాలను అధికారులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. కిర్గిజిస్థాన్ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన కెప్టెన్ తాలైబెక్ మాట్లాడుతూ.. "ప్రధాని మోదీని కలవడం మాకు జీవితంలో ఒక్కసారే వచ్చే అవకాశం. ఆయన ఇక్కడ కిర్గిజిస్థాన్‌కు రావడం గొప్ప విషయం" అని అన్నారు.కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఫిబ్రవరిలో ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత మోదీ, పెజెష్కియాన్ ముఖాముఖిగా సమావేశం కావడం ఇదే తొలిసారి.ఇరువురు నేతలు ఏ అంశాలపై చర్చించారనే విషయం పూర్తిగా వెల్లడికాలేదు. అయితే హర్మూజ్ జలసంధిపై ఇరాన్ విధించిన దిగ్బంధం చర్చల్లో ప్రస్తావనకు వచ్చి ఉండొచ్చని తెలుస్తోంది. కిర్గిజిస్థాన్ పర్యటన తొలి దశలో మోదీతో పెజెష్కియాన్ సమావేశమై చర్చలు జరిపినట్లు భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం తెలిపింది.బిష్కెక్ బయలుదేరే ముందు పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ యుద్ధాన్ని కోరుకోవడం లేదని చెప్పారు. అయితే తమపై జరిగే దాడులకు బలంగా, దృఢంగా స్పందిస్తామని స్పష్టం చేశారు. తమ ప్రాంతంలో అస్థిరత అన్ని దేశాలకు నష్టమేనని అన్నారు. ఆర్థిక, భద్రతా లక్ష్యాల కోసం దేశాల మధ్య సహకారం అవసరమని పేర్కొన్నారు.అర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తోనూ మోదీ భేటీ అయ్యారు. రక్షణ, ఆర్థికం, ఔషధాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, సంస్కృతి, విద్య రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచే అంశాలపై చర్చించారు. పశ్చిమాసియాలో పరిస్థితితో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. అర్మేనియాతో సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని మోదీ తెలిపారు.తర్వాత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ భేటీ కానున్నారు. కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు ఆరో ప్రపంచ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవంలోనూ మోదీ పాల్గొననున్నారు.

## అమెరికాలో పెను విధ్వంసం.. వరదల్లో 20 మంది గల్లంతు!

ఈ ఘటనలో 20 మందికి పైగా గల్లంతైనట్లు సమాచారం. అధికారులు గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు, ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని హెలికాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మధ్యాహ్నం సుమారు 2.30 గంటలకు బ్రైట్ ఏంజెల్ క్రీక్‌లో ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగింది. ఆ నీరు కొలరాడో నదిలోకి దూసుకెళ్లడంతో మార్గంలోని ఫుట్‌బ్రిడ్జ్‌లు ధ్వంసమయ్యాయి. వరద ప్రవాహం కారణంగా అక్కడి భౌగోళిక స్వరూపమే మారిపోయినట్లు అధికారులు తెలిపారు. కొన్ని వీడియోల్లో కొత్తగా నదీ ప్రవాహం ఏర్పడినట్లు కనిపిస్తోంది. నేషనల్ వెదర్ సర్వీస్ ప్రకారం.. కేవలం 30 నిమిషాల్లో భారీ వర్షపాతం నమోదైంది. గ్రాండ్ కేనియన్ ప్రాంతంలో భూభాగం చాలా నిటారుగా ఉండటంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశం లేకుండా ఒక్కసారిగా దిగువకు ప్రవహించింది. దీంతో వరద వేగం అనూహ్యంగా పెరిగింది.వరదల అనంతరం ఫాంటమ్ రాంచ్ నుంచి ఇప్పటివరకు 62 మందిని హెలికాప్టర్ల ద్వారా తరలించినట్లు నేషనల్ పార్క్ సర్వీస్ వెల్లడించింది. ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి మరణాలు లేదా గాయాలు నమోదైనట్లు అధికారులు చెప్పలేదు. అయితే 20 మందికి పైగా వ్యక్తుల ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళన కొనసాగుతోంది.

## భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం అందరి బాధ్యత

దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలన్నారు.పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం వల్ల వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని డిప్యూటీ సీఎం తెలిపారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం అందరి బాధ్యతన్నారు. అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణలను సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమాజానికి, ప్రకృతికి, రాబోయే తరాలకు విలువైన భవిష్యత్తును అందించగలమని పేర్కొన్నారు. ఏపీవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ-గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పవన్ ఆదేశించారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

## 'పుట్టింటి నుంచే బయటకు పంపారు'

అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.నిజామాబాద్‌లో నిర్వహించిన తన పార్టీ పాంచజన్య సభలో కవిత మాట్లాడారు. సొంతంగా పార్టీ పెట్టిన తర్వాత తొలిసారి నిజామాబాద్ గడ్డపై అడుగుపెట్టిన ఆమె.. బీఆర్ఎస్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కన్నీళ్లు పెట్టుకున్నంత మాత్రాన తాను పిరికిదాన్ని కాదన్నారు. అవి బాధ, ఆవేశంతో వచ్చిన కన్నీళ్లని చెప్పారు.కవిత బోరున విలపించడంతో సభలో ఉన్న మహిళలు సైతం కంటతడి పెట్టుకున్నారు. కార్యకర్తలు "కవిత సీఎం.. సీఎం" అంటూ నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు.తెలంగాణలో ఇంకా ఎన్నో మంచి పనులు చేయాల్సి ఉందని కవిత చెప్పారు. అందుకే కొత్త పార్టీ పెట్టానన్నారు. తనను పుట్టింటి నుంచి బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఆర్నెల్లు జైలులో ఉండి వచ్చినప్పుడు పుట్టినిల్లు ఆదరించలేదన్నారు. అదే సమయంలో తన అత్తమామలు ఒక్క మాట కూడా అనకుండా కడుపులో పెట్టుకుని కన్నబిడ్డలా చూసుకున్నారని చెప్పారు.ఏ తప్పూ చేయని తనను తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో గెలుపుతో సమాధానం చెబుతానన్నారు. రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కొత్త రాజకీయ శక్తి అవసరమని పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీళ్లు వచ్చాయా? అని ప్రశ్నించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన వారిని నిలదీసేందుకు బీఆర్ఎస్ ఎందుకు వెనక్కి తగ్గుతోందని ప్రశ్నించారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు.

## తెలంగాణలో తొలిసారిగా కవచ్ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నాం

పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్న రైల్వేస్టేషన్ పనులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. మహబూబ్‌నగర్‌ను రైల్వేహబ్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. 5 వందేభారత్ రైళ్లు కేంద్రం తెలంగాణకు ఇచ్చిందని ప్రస్తావించారు .పదేళ్లలో 100 కొత్త రైళ్లు తెలంగాణలో అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు.తెలంగాణలో 42 రైల్వేస్టేషన్లను ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని చెప్పుకొచ్చారు. 2014కు ముందు రైల్వేస్టేషన్లు అధ్వానంగా ఉండేవని.. కాని నేడు మోదీ హయాంలో పరిస్థితి మారిందని తెలిపారు. ప్రయాణికులు భాగస్వామ్యులయితే స్వచ్ఛస్టేషన్లు సాధ్యమవుతాయని వివరించారు. రైల్వేస్టేషన్లు ఏయిర్‌పోర్టు స్థాయిలో ఉండాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని ఉద్ఘాటించారు.2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో రూ.886 కోట్ల రైల్వేబడ్జెట్ ఉంటే 2026-27 బడ్జెట్‌లో తెలంగాణకే రూ.5454 కోట్లు కేటాయించిందని కిషన్‌రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి తెలంగాణలో రైల్వే రంగం నిర్లక్ష్యానికి గురయ్యిందని అన్నారు. దేశంలో 7 బుల్లెట్ ట్రైన్ ప్రవేశపెడితే.. తెలంగాణకు మూడు ఇచ్చామని.. ఇది రైల్వేరంగంలో సువర్ణాధ్యాయమని నొక్కిచెప్పారు రూ.5 లక్షల కోట్లతో బుల్లెట్ ట్రైన్స్ అందుబాటులోకి తీసుకువస్తున్నామని స్పష్టం చేశారు. ప్రమాదాలు జరగకుండా దేశంలోనే తొలిసారిగా కవచ్ ప్రాజెక్ట్‌ను తెలంగాణలో ప్రయోగాత్మకంగా అమలు చేయబోతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## "కరోనా కాలంలోనూ వైఎస్ జగన్ వెలిగొండ పనులను ఆపలేదు"

వెలిగొండ ప్రాజెక్టు ఘనత వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని చెప్పారు. వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 30.5 కిలోమీటర్ల టన్నెల్స్ పూర్తి చేశారని అనన్నారు. వెలిగొండ ప్రాజెక్టు రెండు టన్నెల్స్ పొడవు 37 కిలోమీటర్లని వివరించారు. "వెలుగొండ ప్రాజెక్ట్ నేనే ప్రారంభించా, నేనే పూర్తి చేశా అని చంద్రబాబు క్రెడిట్ చోరీకి పాల్పడ్డాడు. 1996 లో శంకుస్థాపన చేసి ఎనిమిది ఏళ్లు సీఎంగా వున్న చంద్రబాబు ఒక తట్ట మట్టి ఎత్తిన దాఖలాలు లేవు. మొత్తం ప్రాజెక్ట్ వర్క్ లో 37.6 కి.లో సొరంగాలు తవ్వకాలు జరిపి పూర్తి చేసిన ఘనత వైఎస్ఆర్, జగన్ ది. 53.8 టీఎంసీ గల డ్యామ్ 87% శాతం నిర్మాణం వైఎస్ఆర్, జగన్ లే పూర్తి చేశారు. చంద్రబాబు పాలనలో రోజుకి 2.4 మీటర్ల పని మాత్రమే జరిగిదే. జగన్ హయాంలో కరోనా పరిస్థితిలో కూడా రోజుకు 4.5 మీటర్లు పనులు జరిగివే. 2024 జనవరిలో రెండు టనల్స్, హెడ్ రెగులేటర్స్ పూర్తి చేసి జగన్ ప్రారంభించారు. అదానీ డేటా సెంటర్ పేరు మార్చి నా క్రెడిట్ అనడం, విమానాశ్రయాల క్రెడిట్ ను దోచుకోవడం ఇంకా ఎన్ని దారుణాలకు పాల్పడుతాడు. రాష్ట్రంలో నేడు మా హయాంలో జరిగి దాదాపు పూర్తి కావచ్చని అన్ని పనుల తాలూకా క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారు. మార్కాపురంలో మెడికల్ కాలేజ్, ఆసుపత్రి ప్రారంభాన్ని అడ్డుకుని నేడు మార్కాపురాన్ని నేనే అభివృద్ధి చేశా అనడం హస్యాస్పదం. మాగుంట శ్రీనివాసుల రెడ్డి తన స్థాయి దిగజారి జగన్ మోహన్ రోడ్డుపై విమర్శలు చేయడం దారుణం.బీదా రవిచంద్ర మీకు చిత్త శుద్ధి వుంటే నెల్లూరు రైతాంగం గురించి ఆలోచన చేస్తే బాగుంటుంది. ఎన్టీఆర్ కాలం నాటి రాజకీయాలు మాట్లాడటం మానీ వెన్నుపోటు చంద్రబాబు రాజకీయంపై స్పందించండి. మీ నాయకుడు చంద్రబాబు బీసిలకు ఎందుకు రాజ్యాంగబద్ధ పదవులు ఇవ్వలేక పోయారు మొదట సమాధానం చెప్పాలి. సోమశిల అప్రాన్ పనులు నేను మంత్రిగా వున్న సమయంలో టెండర్లు పిలిచి 20% పైగా పనులు చేశాం.

# ముసారాం బ్రిడ్జిని ప్రారంభించిన సీఎం రేవంత్

దీని ప్రారంభంతో ఇక వర్షాకాలంలో వాహనదారులకు ఇక్కట్లు తప్పనున్నాయి.మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ బ్రిడ్జిని రూ.52 కోట్ల వ్యయంతో 400 మీటర్ల పొడవుతో నిర్మించగా.. సీఎం నేడు (సోమవారం) ప్రారంభోత్సవం చేశారు. మూసీ నదిలో లక్షా యాభై వేల క్యూసెక్కుల వరద వచ్చినా ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పటిష్ఠంగా దీనిని నిర్మించారు. ఈ బ్రిడ్జితో అంబర్‌పేట, మూసారాంబాగ్ ప్రాంతాలకు ప్రయాణాలు సులభం కానున్నాయి.ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, శ్రీ గణేశ్, నవీన్ యాదవ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపీ మధు యాష్కీ, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.హైదరాబాద్ నగరంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా మూసీ నదిపై నూతనంగా నిర్మించిన ముసారాంబాగ్ హైలెవెల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించి జాతికి అంకితం చేశారు. రూ.52 కోట్ల వ్యయంతో 400 మీటర్ల పొడవున జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజల నిరీక్షణకు తెరపడింది. వర్షాకాలంలో మూసీ నది ఉప్పొంగినప్పుడలా పాత వంతెన నీటమునిగి తీవ్ర ట్రాఫిక్ స్తంభన ఎదురయ్యేది. భవిష్యత్తులో ఎంతటి భారీ వరదలు వచ్చినా రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఈ హైలెవెల్ బ్రిడ్జిని ప్రత్యేక ఇంజినీరింగ్ ప్రమాణాలతో రూపొందించారు. ఈ బ్రిడ్జి ప్రారంభంతో ముసారాంబాగ్, అంబర్పేట్, మలక్పేట్, చదర్ ఘాట్ పరిసర ప్రాంతాల ప్రజలకు గంటల తరబడి ఎదురయ్యే ట్రాఫిక్ కష్టాల నుంచి శాశ్వత ఉపశమనం లభించనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలతో పాటు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు .హైదరాబాద్ నగర వాసులకు నీటి కొరత తీర్చేలా రాష్ట్ర ప్రభుత్వం మూసీ నది పునరుజ్జీవనంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి ఘన్‌పూర్ వరకు నీటిని తరలించేందుకు రెండు భారీ పైప్‌లైన్ల నిర్మాణానికి సంబంధించిన ప్రాజెక్టుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రెండు పైప్‌లైన్లలో ఒక్కో పైప్‌లైన్ దాదాపు 10 టీఎంసీల నీటిని తరలించే సామర్థ్యం కలిగి ఉంటుందని పేర్కొంది. కాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవనంలో ప్రాజెక్టులో భాగంగా మూసీ పునరుజ్జీవనంతోపాటు హైదరాబాద్ మహా నగరానికి తాగునీటి సమస్యను పరిష్కరించడానికి మల్లన్నసాగర్ నుంచి 20టీఎంసీల నీటిని గోదావరి తాగునీటి ప్రాజెక్టు 2,3 దశల ద్వారా తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ పనులకు సంబంధించిన టెండర్లను ఆహ్వానిస్తూ జలమండలి గతంలోనే నోటిఫికేషన్ జారీచేసింది. హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో రూ.5383.67కోట్లతో రెండు ప్యాకేజీలుగా పనులు చేపట్టాలని నోటిఫికేషన్?లో జలమండలి పేర్కొన్నది. 2,3 దశలకు సంబంధించిన పైపులైన్ లను రెండు వరుసలుగా వేయనున్నారు. మొదటి ప్యాకేజీలో మల్లన్నసాగర్ నుంచి ఘన్ పూర్ వరకు, రెండో ప్యాకేజీలో ఘన్ పూర్ నుంచి ఉస్మాన్ సాగర్ వరకు పనులు చేపట్టనున్నారు. ఈ రెండు ప్యాకేజీల్లో పైపులైన్, పంపింగ్, నిర్మాణంతోపాటు టెస్టింగ్, కమిషనింగ్ వంటి కార్యక్రమాలను అన్నింటిని కలిపి ప్రాజెక్టు విలువ అంచనా వేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం మంగళవారంతో (సెప్టెంబర్ 1నాటికి) వెయ్యి రోజుల మైలురాయిని పూర్తిచేసుకుంటోంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను అందించడం, సంక్షేమానికి, సామాజిక న్యాయానికి పెద్దపీట వేయడం.. రైతు, యువజన, మహిళా శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇస్తూ.. రాష్ట్ర సంపదను పెంచడమే లక్ష్యంగా ప్రజాపాలన దూసుకుపోతోందని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకుని రావడంలో, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు నిర్మించడంలో ఈ వెయ్యి రోజుల పాలన కొత్త అధ్యాయాన్ని నమోదు చేసిందని ఆదివారం ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. సంక్షేమ పథకాల అమలుతో పాటు వ్యవసాయం, మహిళా సాధికారత, విద్య, వైద్యం, ఉద్యోగ కల్పన, సామాజిక న్యాయం, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలపై ఈ కాలంలో ప్రధానంగా దృష్టి సారించినట్టు ప్రకటించింది.

# వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేశామని డ్రామా ఆడారు

ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, తన రాజకీయ జీవితంలో ఇదొక మరపురాని రోజని, మాట ఇచ్చి నిలబెట్టుకు న్నానన్న సంతృప్తితో గుండె ఆనందంతో నిండిపోయిందని భావోద్వేగంగా అన్నారు. 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా ఇదే ప్రాజెక్టుకు తాను పునాదిరాయి వేసిన క్షణాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిగా 2026 ఆగస్టు 31న దీనిని ప్రారంభించడం భగవంతుడు తనకు ఇచ్చిన అరుదైన అవకాశంగా అభివర్ణించారు. "పునాది వేశాను, ప్రాజెక్టు పూర్తి చేశాను, కృష్ణమ్మను తెచ్చాను, కరవును తరిమి కొడుతున్నాను. మాట ఇచ్చాను, నిలబెట్టుకున్నాను. ఈ ప్రాంత ప్రజల కళ్లలో ఆనందం చూస్తుంటే మాటలు పెగలడం లేదు. ఇది నా అదృష్టం" అని చంద్రబాబు అన్నారు.ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, ఊళ్లు త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసిత ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని, వారి త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతుందని కొనియాడారు. వెలిగొండ అంటే కరవుపై గెలుపు, రైతు భవిష్యత్తుకు నమ్మకం, ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు అని ఆయన అభివర్ణించారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టిందని, 2024 ఎన్నికలతో ఆ గ్రహణం వీడిందని చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ప్రభుత్వం కేవలం 2.77 శాతం పనులు చేసి, విలువైన కాలాన్ని గాలికొదిలేసింది. ఎన్నికలకు నెల ముందు రూ.4,500 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేశామని డ్రామా ఆడింది. ఇది సిగ్గులేనితనం కాదా? కరవు ప్రాంత రైతులతో ఆడుకోవడానికి మానవత్వం ఉందా?" అని ఆయన ప్రశ్నించారు. సొరంగంలో ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ మిషన్‌ను తాను స్వయంగా రంగంలోకి దిగి తొలగించానని చంద్రబాబు వెల్లడించారు. ఆ తర్వాత, ఇంకా పనులు మిగిలి ఉండగానే సొరంగాలు మొత్తం తిరిగివచ్చానని, ప్రాజెక్టు సిద్ధంగా ఉందని చెప్పిన ఆనాటి ఫేక్ ముఖ్యమంత్రిని ఏమనాలో మార్కాపురం ప్రజలే ఆలోచించాలని అన్నారు. తన హయాంలోనే ప్రాజెక్టుకు 50 శాతానికి పైగా నిధులు ఖర్చు చేశామని, వాస్తవాలు చరిత్రలో నిలిచిపోతాయని, ఫేక్ మాటలతో ప్రజలను ఎవరూ మోసం చేయలేరని చంద్రబాబు స్పష్టం చేశారు.ప్రాజెక్టుతో లబ్ధి పొందే రైతులు ఎంత సంతోషంగా ఉంటారో, త్యాగాలు చేసిన నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి అన్నారు. నిర్వాసితులకు ఇప్పటికే రూ.768 కోట్లు అందించామని, త్వరలోనే మిగిలిన రూ.165 కోట్లు, రూ.169 కోట్లు కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కటాఫ్ డేట్ సమస్యతో నష్టపోయిన వారికి అదనంగా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఏ ఒక్క నిర్వాసితుడు ఇబ్బంది పడకుండా ఆదుకోవడం తమ ప్రభుత్వ సిద్ధాంతమని ఆయన పునరుద్ఘాటించారు.ఎల్ నినో ప్రభావంతో ఎగువన జలాశయాల్లో నీళ్లు లేకపోయినా, కనీసం తాగునీటి అవసరాల కోసం 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు తీసుకొస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఈ నీటితో మొదటి విడతలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుందని వివరించారు. ప్రాజెక్టు పూర్తిగా పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రకాశం తలరాత మారుతుందని, ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుందని భరోసా ఇచ్చారు.దేశంలో నీటి సమస్యకు నదుల అనుసంధానమే ఏకైక పరిష్కారమని, అది ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని చంద్రబాబు అన్నారు. 2027 మార్చి నాటికి పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని, వచ్చే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ వైభవంగా జరుపుకోబోతున్నామని ప్రకటించారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో దక్షిణ భారతదేశంలోని నీటి యుద్ధాలకు ముగింపు పలకవచ్చని, ఆ దిశగా కేంద్రంతో చర్చలు సాగుతున్నాయని తెలిపారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చామని, ఆ మాట నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు. మార్కాపురాన్ని రూ.లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌లో భాగం చేశామని, 2028 నాటికి వెలిగొండ రెండో దశను కూడా పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సభకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2019లో అధికారంలోకి రావడంతో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు (ఙూ జవీ జష్ఖుఅ఑ఙఖఎఐ ఛీఖఅఐ) విమర్శించారు. 2024లో కూటమి రాకతో గ్రహణం వీడిందని తెలిపారు. ఈరోజు (సోమవారం) మార్కాపురం జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. వెలిగొండ ప్రాజెక్ట్ ఫేజ్-1 ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. కృష్ణా నీటికి జలహారతి, పైలాన్‌ను ఆవిష్కరించారు. నల్లమలసాగర్‌కు నీటిని విడుదల చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. గొడ్డలి పార్టీ హయాంలో విలువైన ఈ ప్రాజెక్ట్ నిర్మాణ కాలాన్ని గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి అరకొర చెల్లింపులతో మోసం చేశారని ఆగ్రహించారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల కంటే ఒక్క నెల ముందు ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తున్నట్లుగా జగన్ డ్రామాలు ఆడారని మండిపడ్డారు.రూ.4 వేల కోట్ల పనులను పెండింగ్‌లో ఉంచుకుని ఈ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేసిన సిగ్గులేని గొడ్డలి పార్టీని ఏమనాలని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు.

# శిలాఫలకమే మీది.. సంకల్పం, సమగ్ర నిర్మాణం వైఎస్సార్‌ది

వెలిగొండ ప్రాజెక్టు చరిత్ర చాలా స్పష్టం.. శిలాఫలకం మాత్రమే మీది.. సంకల్పం, సమగ్ర నిర్మాణం వైఎస్సార్ గారిది.. కీలక జంట సొరంగాలు పూర్తి చేసిన ఘనత మా ప్రభుత్వానిది.. ఇప్పుడు జరుగుతున్నది మీ 'క్రెడిట్ చోరీ' అంటూ సీఎం చంద్రబాబుపై ధ్వజమెత్తారు. మీరు, మీ అనుకూల మీడియా ఎంతగా చరిత్రను వక్రీకరించినా వాస్తవాలు మారవు.. మీ మీడియాలో మీకు భజన చేయించుకున్నంత మాత్రాన నిజాలను దాచలేరంటూ సీఎం చంద్రబాబుకు చురకలంటించారు. నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రచార ఆర్భాటాన్ని పక్కన పెట్టి.. నల్లమలసాగర్‌ను నింపి.. రైతులకు సాగునీరు, ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు రక్షిత మంచినీరు అందించాలని హితవు పలికారు. పెద్దదోర్నాల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మార్కాపురం ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రభుత్వ రంగంలో పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ తన 'ఎక్స్' ఖాతాలో వైఎస్ జగన్ ఆదివారం పోస్టు చేశారు. అందులో ఆయన ఏమన్నారంటే..నాన్నగారి స్వప్నమైన వెలిగొండ ప్రాజెక్టు సాకారం కావడం ఎంతో సంతోషంగా ఉంది. ఆ మహాయజ్ఞంలో భాగస్వామిని కావడం.. మా ప్రభుత్వ హయాంలో అత్యంత క్లిష్టమైన జంట సొరంగాలను పూర్తిచేసి జాతికి అంకితం చేయడం.. ఇవాళ వాటి ద్వారా కృష్ణా జలాలు ప్రవహించడం నాకు ఎంతో సంతృప్తినిస్తోంది. రక్షిత మంచినీరు లేక ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్న లక్షలాది కుటుంబాలకు, సాగునీటి కోసం ఎదురు చూస్తున్న రైతులకు వెలిగొండ ఒక సంజీవని. కానీ వెలిగొండపై చంద్రబాబు, ఆయన ఎల్లో మీడియా చేస్తున్న హడావుడి చూస్తే ఆశ్చర్యమేస్తోంది. కొన్ని రోజులుగా చేస్తున్నవన్నీ వెలిగొండ నిర్మాణ చరిత్రను మార్చే పబ్లిసిటీ ఫీట్లు, క్రెడిట్ చోరీ ప్రయత్నాలే. చంద్రబాబు గారూ వెలిగొండ చరిత్ర చాలా స్పష్టం. శిలాఫలకం మాత్రమే మీది. సంకల్పం, సమగ్ర నిర్మాణం వైఎస్సార్ గారిది.. కీలక జంట సొరంగాల పూర్తి ఘనత మా ప్రభుత్వానిది.. ఇప్పుడు జరుగుతున్నది మీ క్రెడిట్ చోరీ.చంద్రబాబు గారూ మీరు, మీ అనుకూల మీడియా ఎంతగా చరిత్రను వక్రీకరించినా వాస్తవాలు మారవు. మీ మీడియాలో మీకు భజన చేయించుకున్నంత మాత్రాన నిజాలను దాచలేరు. 1996లో హడావుడిగా, అప్పట్లో ఎన్నికల ముందు శంకుస్థాపన రాయి వేసి చేతులు దులుపుకొన్నారు. ఆ తర్వాత 2004 వరకూ ఎనిమిదేళ్లు అధికారంలో ఉన్నా ప్రాజెక్టును ఒక్క అడుగూ ముందుకు తీసుకెళ్లలేదు. ఆ ఎనిమిదేళ్లలో మీరు ఖర్చు చేసింది కేవలం రూ.10 లక్షలు. అదీ శంకుస్థాపన, సభ ఏర్పాట్లకే. వెలిగొండపై మీ చిత్తశుద్ధి ఏమిటో ఈ ఒక్క వాస్తవమే చెబుతోంది.వైఎస్సార్ గారు ముఖ్యమంత్రి అయ్యాక జలయజ్ఞంలో భాగంగా వెలిగొండకు సమగ్ర రూపమిచ్చారు. జంట సొరంగాలు, నల్లమలసాగర్, మూడు డ్యామ్‌లు, ఫీడర్ ఛానల్, ప్రధాన కాలువల నిర్మాణాన్ని చేపట్టి ప్రాజెక్టును సాకారం చేశారు. వెలిగొండకు ప్రాణం 37.587 కిలోమీటర్ల జంట సొరంగాలు. అవి లేకపోతే కృష్ణా జలాలు రావు. వైఎస్సార్ గారు ప్రారంభించిన నిర్మాణ దశలో 20.333 కిలోమీటర్లు పూర్తయ్యాయి. 2014--19 మధ్య మీ హయాంలో జరిగింది కేవలం 6.686 కిలోమీటర్లు. ఒక్క సొరంగానికి కూడా బ్రేక్‌త్రూ సాధించలేకపోయారు. మా ప్రభుత్వ హయాంలో కరోనా, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూనే మిగిలిన అత్యంత క్లిష్టమైన 10.568 కిలోమీటర్ల తవ్వకాన్ని పూర్తి చేశాం. టన్నెల్--1ను 2021 జనవరిలో, టన్నెల్--2ను 2024 జనవరిలో పూర్తిచేశాం.

# రెండు దశల్లో నిర్మాణం.. 2028 నాటికి తొలి దశ పూర్తి

ఇప్పుడు తెలుగుదేశం, వైసీపీల మధ్య తీవ్ర రాజకీయ వివాదానికి కేంద్రంగా మారింది. మంత్రి నారా లోకేశ్.. వైసీపీ అధినేత జగన్ ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు చేశారు. ఇవాళ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడం తెలిసిందే.నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో, "ఆ విజువల్స్‌ను దగ్గరగా చూడండి" అంటూ కొన్ని ఫోటోలను పోస్ట్ చేశారు. "2024లో వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారు. నీళ్లు లేని ఒక నీటిపారుదల ప్రాజెక్టును ప్రారంభించారు. ఇలాంటి ఫేక్ ప్రారంభోత్సవం వైసీపీకే సాధ్యం!" అని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వం 2024 మార్చిలో సొరంగాలు పూర్తి చేసిన సందర్భంగా నీటి ప్రవాహం లేకుండానే ప్రారంభోత్సవం జరిపిందని, ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం నిజంగా నీటిని విడుదల చేసిందని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు.కాగా, జగన్ నిన్న ఒక సుదీర్ఘ పోస్ట్‌లో వెలిగొండ ప్రాజెక్టు ఘనత తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డిది, తన ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కీలకమైన సొరంగాల పనులను తమ ప్రభుత్వమే పూర్తి చేసిందని, టీడీపీ హయాంలో పనులు నెమ్మదిగా సాగాయని విమర్శించారు. ఈ పోస్టుకు కౌంటర్‌గానే లోకేశ్ తాజా విమర్శలు చేశారు.సోమవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభించి, నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేశారు. తొలి విడతగా 10.7 టీఎంసీల నీటిని విడుదల చేయడంతో, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరవు, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు చెందిన సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందనుంది.ఆంధ్రప్రదేశ్ వైద్య రంగంలో మరో కీలక ముందడుగు పడింది. ఆసియాలోనే ప్రసిద్ధి గాంచిన ఏఐజీ (ఏఐజీ) హాస్పిటల్స్ ఇప్పుడు విశాఖపట్నంలో కొలువుదీరనుంది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ మెగా హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. విశాఖ ఆనందపురం మండలం ఎండాడ వద్ద ఏఐజీ హాస్పిటల్స్ ఛైర్మన్, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డితో కలిసి మంత్రి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.విశాఖలో నెలకొల్పనున్న ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కోసం ఏఐజీ యాజమాన్యం ఐదేళ్లలో దశలవారీగా రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. నిర్మాణం పూర్తయితే వెయ్యి పడకల సామర్థ్యంతో ఇది ఉత్తరాంధ్రలోనే అతిపెద్ద వైద్య కేంద్రాల్లో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 9,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇది ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడగలదని అంచనా వేస్తున్నారు.హాస్పిటల్ నిర్మాణాన్ని రెండు దశల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి దశలో 650 పడకల సామర్థ్యంతో 2028 అక్టోబర్ నాటికి సేవలు ప్రారంభించాలని భావిస్తున్నారు. మిగిలిన 350 పడకలతో రెండో దశను ఆ తర్వాత రెండేళ్లలో పూర్తి చేస్తారు. మొత్తం 9 ఎకరాల విస్తీర్ణంలో హాస్పిటల్ క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏఐజీ తరహాలోనే ఇక్కడ కూడా 8 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, 50కి పైగా వైద్య విభాగాలతో ప్రపంచ స్థాయి సేవలు అందించనున్నారు. కేవలం వైద్య సేవలే కాకుండా ఒకేచోట శిక్షణ, పరిశోధన, రోగులు మరియు వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సదుపాయాలతో ఒక సంపూర్ణ హెల్త్ కేర్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయనున్నారు. శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు ఏఐజీ హాస్పిటల్స్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.

# తెలంగాణకు తీరని ద్రోహం - మన ప్రాజెక్టులు ఎండిపోతున్నాయ్

అక్రమంగా తరలిస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చోద్యం చూస్తున్నారని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్ రావు ధ్వజమెత్తారు. ఏపీ అడ్డగోలుగా నీటి దోపిడీకి పాల్పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నోరు మెదపకపోవడం తెలంగాణ రైతాంగానికి ద్రోహం చేయడమేనని మండిపడ్డారు. ఈ మేరకు 'ఎ క్స్' వేదికగా ప్రకటన విడుదల చేశారు. ఆ పోస్టులో రాష్ట్ర ప్రభుత్వం, కేఆర్ఎంబీ తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. నీటి కేటాయింపులు లేకున్నా వరద జలాలు రాకున్నా.. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తుంటే సీఎం రేవంత్ రెడ్డి చోద్యం చూస్తూ తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే మరోవైపు ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులపై దండెత్తి కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తోందని ఆరోపించారు. కృష్ణా బేసిన్‌లో భాగమైన బీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టులు ఎండిపోతుంటే మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ యథేచ్ఛగా నీటిని తరలిస్తోందన్నారు. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జునసాగర్ కుడి కాల్వ.. ఇప్పుడు వెలిగొండ.. ఇలా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలిస్తున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తున్నదన్నారు. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను మన పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్ రెడ్డి.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారని నిలదీశారు. ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) సైతం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన సంస్థే ప్రేక్షకపాత్ర పోషిస్తే రాష్ట్ర నీటి హక్కులను ఎవరు కాపాడాలి అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దీనిపై వెంటనే స్పందించాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీపై ఒత్తిడి తెచ్చి తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపి, ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగునీటి ఎద్దడి ఏర్పడి భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులు ఎండిపోతుంటే, ఏపీ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలించుకుపోవడం తెలంగాణ రైతాంగ హక్కులపై దాడి చేయడమేనని మండిపడ్డారు.ఇప్పటికే మల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలించుకుపోయిందని, ఇప్పుడు వెలిగొండ వంతు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ ప్రాంత ఆయకట్టుకు నీరందించడంలో విఫలమైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఏపీ చర్యలపై ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు.

సీమకిరణం కర్నూలు నంద్యాల తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



# ఆత్మకూరు డి.ఎస్.పి గా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ ....



**నెల్లూరు ఆత్మకూరు ఆగస్టు 31 సీమ కిరణం న్యూస్:** ఆత్మకూరు నూతన డీఎస్పీగా టి. వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూరు సబ్-డివిజన్ నూతన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ డి పి)గా టి.వెంకటేశ్వర్లు పదవీ బాధ్యతలు స్వీకరించారు. పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మీడియా మిత్రులతో మాట్లాడుతూ, ఆత్మకూరు సబ్-డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అదేవిధంగా పేకాట, జూదం, బెట్టింగ్, కోడి పందాలు, మట్కా తదితర అసాంఘిక చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళలు చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని, వారిపై ఎవరైనా దాడులు, వేధింపులు లేదా ఇతర అఘాయిత్యాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో సంబంధిత నిబంధనల ప్రకారం హిస్టరీ/సెక్సువల్ అఫెన్డర్ షీట్లు తెరవడం వంటి చర్యలు కూడా చేపడతామని పేర్కొన్నారు. అలాగే, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు, వినతులు సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి, దాని స్వభావాన్ని బట్టి వెంటనే విచారణ చేపట్టి, చట్టపరంగా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను ఎలాంటి భయం లేకుండా పోలీసుల దృష్టికి తీసుకురావచ్చని, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత, వేగం మరియు బాధ్యతాయుతమైన స్పందన ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు సైబర్ మోసాలు, ఆన్‌లైన్ ఆర్థిక నేరాలు, అనుమానాస్పద లింకులు, ఓటిపి లు వ్యక్తిగత సమాచార పరిరక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. సబ్-డివిజన్ పరిధిలోని ప్రాంతాలను స్వయంగా క్షేత్రస్థాయిలో సందర్శించి, స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రజల సహాయ సహకారాలతో వాటికి శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.ప్రత్యేకంగా ఆత్మకూరు పట్టణంలో తరచుగా ఏర్పడుతున్న ట్రాఫిక్ జామ్ సమస్య పరిష్కారంపై దృష్టి సారిస్తామని, పోలీసు, మున్సిపల్, రెవెన్యూ మరియు ఇతర సంబంధిత శాఖల సమన్వయంతో పాటు వ్యాపారులు, వాహనదారులు మరియు ప్రజల సహకారంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఆత్మకూరు సబ్-డివిజన్‌లో శాంతి భద్రతలు, నేర నియంత్రణ, మహిళలు--చిన్నారుల భద్రత, ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారం, సైబర్ నేరాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ మరియు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొంటూ, ఇందుకు సబ్-డివిజన్ పరిధిలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు...

# పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీసులకు ఘన సన్మానం

సేవల్ని గుర్తుచేసుకున్న పోలీసు శాఖ.. శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేత

ముగ్గురు పోలీసు సిబ్బందిని ఘనంగా సన్మానించిన కర్నూలు పోలీసు శాఖ..









**కర్నూలు క్రైమ్, ఆగస్టు 31, (సీమకిరణం న్యూస్) :** పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీసు అధికారులు, సిబ్బందిని కర్నూలు ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ ఘనంగా సన్మానించారు. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పదవీ విరమణ పొందిన వారిలో ఎస్సై పి.ఎం. అలీఖాన్ (కర్నూలు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్), ఎ.ఎస్సై హెచ్.పి. ఫక్రుద్దీన్ (పత్తికొండ పోలీస్ స్టేషన్), హెడ్ కానిస్టేబుల్ జె. తిరుపాలు (పోలీస్ కంట్రోల్ రూమ్--కర్నూలు) ఉన్నారు. ఈ సందర్భంగా ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ పదవీ విరమణ పొందిన పోలీసులను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. పోలీసు శాఖకు వారు అందించిన సేవలను అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ.. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా, ప్రశాంతంగా జీవించాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ తర్వాత ఏవైనా సమస్యలు ఎదురైతే నేరుగా జిల్లా ఎస్పీని సంప్రదించవచ్చని తెలిపారు. పోలీసు శాఖ ఎల్లప్పుడూ వారి సంక్షేమానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, పదవీ విరమణ పొందిన పోలీసుల కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# క్రమ-శిక్షణకు మారుపేరు.. సేవకు ప్రతిరూపం!

44 ఏళ్ల పోలీస్ ప్రస్థానానికి ఘన వీడ్కోలు..

ఎస్సై పి.ఎం. అలీఖాన్ పదవీ విరమణ

కర్నూలు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సై పి.ఎం. అలీఖాన్ పదవీ విరమణ






**కర్నూలు క్రైమ్, ఆగస్టు 31, (సీమకిరణం న్యూస్):** క్రమశిక్షణకు మారుపేరు.. విధి నిర్వహణలో అంకితభావానికి ప్రతీక.. నాలుగు దశాబ్దాలకు పైగా పోలీస్ శాఖలో సేవలందించిన కర్నూలు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సై పి.ఎం. అలీఖాన్ పదవీ విరమణ చేశారు. పోలీస్ శాఖలో 44 ఏళ్ల పాటు అంకితభావంతో సేవలందించిన కర్నూలు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సై పి.ఎం. అలీఖాన్ పదవీ విరమణ సందర్భంగా పోలీస్ అధికారులు, సహచర సిబ్బంది, కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. దశాబ్దాలపాటు పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో తన వంతు బాధ్యతను నిర్వర్తించిన అలీఖాన్ సేవలను ఈ సందర్భంగా అధికారులు, సహచరులు గుర్తుచేసుకున్నారు. 44 ఏళ్ల సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానం అనంతరం పదవీ విరమణ చేయడం ఆయన కుటుంబ సభ్యులతో పాటు సహచర పోలీస్ సిబ్బందిలోనూ భావోద్వేగాన్ని నింపింది.

### సేవే లక్ష్యంగా.. బాధ్యతే ధ్యేయంగా..

పోలీస్ ఉద్యోగంలో ఎన్నో సవాళ్లు ఎదురైనా విధి నిర్వహణలో నిబద్ధతతో ముందుకు సాగిన అలీఖాన్, తన సుదీర్ఘ ప్రస్థానంలో శాఖ పట్ల అంకితభావాన్ని చాటుకున్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, బాధ్యతాయుత వైఖరితో సహచరుల మన్ననలు పొందారు. పదవీ విరమణ కార్యక్రమంలో ఆయనకు శాలువా కప్పి, పూలమాలలు వేసి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. కుటుంబ సభ్యులను కూడా సత్కరించి అలీఖాన్‌తో తమ అనుబంధాన్ని అధికారులు, సిబ్బంది పంచుకున్నారు.

### సహచరుల ఆత్మీయ వీడ్కోలు..!

44 ఏళ్ల పోలీస్ సేవకు ముగింపు పలుకుతున్న సందర్భంగా సహచరులు మాట్లాడుతూ.. అలీఖాన్‌తో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఆయన సేవలు, అనుభవం, సహచరులతో కలిసిమెలిసి పనిచేసే తీరు ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన సేవా ప్రస్థానానికి ముగింపు పలికిన ఎస్సై పి.ఎం. అలీఖాన్‌కు అధికారులు, సహచరులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. పదవీ విరమణ అనంతరం ఆయన జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు.

# విద్యుత్ షాక్‌తో రైల్వే కాంట్రాక్ట్ ఉద్యోగికి తీవ్ర గాయాలు




**వెల్దుర్తి, ఆగస్టు 31( సీమకిరణం న్యూస్ ):** కర్నూలు జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని స్థానిక రైల్వేవిద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం ప్రమాదం చోటుచేసుకుంది. జొన్నగిరి గ్రామానికి చెందిన నరేంద్ర అనే కాంట్రాక్ట్ ఉద్యోగి రైల్వే కాంట్రాక్ట్ ఎలక్ట్రీషియన్ పనులు చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటనలో నరేంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన సిబ్బంది, స్థానికులు నరేంద్రను చికిత్స నిమిత్తం వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం అవసరమని సూచించారు. దీంతో అంబులెన్స్ ద్వారా నరేంద్రను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# డోన్ జేపీసీ చైర్మన్ ఏ వెంకటేశ్వర్లు మరియు బాల మద్దయ్య రెడ్ క్రాస్ సొసైటీ ప్రశంస పత్రం



**డోన్ టౌన్, ఆగస్టు 31,(సీమ కిరణం న్యూస్):** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కి విశేష సేవలు అందించిన డోన్ రెడ్ క్రాస్ చైర్మన్ ఏ వెంకటేశ్వర్లకు, జేపీసీ కమిటీ మెంబర్ బాలమద్యకు 2024--2025--26 సంవత్సరాలకు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా , జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ చేతులు మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్నారు.అందులో భాగంగా డోన్ మండలానికి చెందిన మదారి కురువ మదాసి కురువ సంఘం వారు డో న్ రెడ్ క్రాస్ చైర్మన్ కే వెంకటేశ్వర్లు కు , జేపీసీ కమిటీ మెంబర్ యు బాలమద్యకు జిల్లా స్థాయిలో ప్రశంసా పత్రాలు తీసుకున్న శుభసందర్భంగా మదాసి కురువ మదారి కురువ రాష్ట్ర కోశాధికారి కేసీ మద్దిలేటి, డోన్ పట్టణ అధ్యక్షులు స్పేర్ పార్ట్స్ ప్రసాద్, పట్టణ ప్రధాన కార్యదర్శి బత్తిన మునిస్వామి, కోశాధికారి ఆర్టీసీ మేఘవనుడు, ఏపీపీ లాయర్ లక్ష్మన్న ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినారు. ఈ కార్యక్రమంలో హోటల్ గంగన్న అలేబాద పరమేష్,శేఖర్, రమే ష్, అంజి బాలరంగడు, కొల్లాపూర్ మధు, మెకానిక్ మధు, ఆటో ఓబులేసు,చనుగోండ్ల వెంకట రామయ్య,ఫోటో రవి, మెడికల్ స్టోర్ వెంకటస్వామి, దొరపల్లె నాగరాజు, కొచ్చె ర్వు మల్లికార్జున, తదితర కుర్వ కులస్తులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఇద్దరికీ జైలు శిక్ష, ఇద్దరికీ జరిమానా







**డోన్ టౌన్, ఆగస్టు 31,(సీమ కిరణం న్యూస్):** డోన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్ . నూరుల్లా ఇద్దరికీ రెండు రోజులు జైలు శిక్ష , ఇద్దరికీ పదివేలు జరిమానా విధించినట్లు రూరల్ సీఐ రాకేష్, ఎస్సై మమత తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్లో నమోదైన డ్రంకన్ అండ్ డ్రైవ్ కేసులో ,గోల్ల పెద్ద దస్తగిరి కొన్నూరు గ్రామం, గోనెగండ్ల మండలం , అనే వ్యక్తికి పదివేలు జరిమానా.జి. రవి , చుంచూ ఎర్రగుడి గ్రామం, క్రిష్ణగిరి మండలం,అనే వ్యక్తికి పదివేలు జరిమానా. మారప్ప వెంకటనాయినిపల్లి గ్రామం, డోన్ మండలం, అనే వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష. ఏ . మనోహర్ క్రిష్ణగిరి గ్రామం, వెల్దుర్తి మండలం, అనే వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష. మద్యం సేవించి వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల డ్రైవర్ ప్రాణాలతో పాటు అమాయక ప్రజల ప్రాణాలు కూడ ప్రమాదంలోకి పడతాయని, ఎవరు మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి, కోర్టు ముందు హాజరుపరుస్తామని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనం నడపడం వలన భారీ జరిమానాలు, జైలు శిక్ష తప్పవని హెచ్చరించారు.. రోడ్డు ప్రమాదాలు పెరగకుండా ఉండాలంటే ప్రజలందరూ చట్టాన్ని కచ్చితంగా పాటించాలి. ఎవరైనా మద్యం సేవించి వాహనం నడిపితే వారి పై డోన్ రూరల్ పోలీస్ స్టేషన్ కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి వెనుకడుగు వేయరు. ప్రజలందరూ తమ ప్రాణాల రక్షణ కోసం, ఇతరుల ప్రాణాల రక్షణ కోసం మద్యం సేవించి వాహనాలు నడపరాదని డోన్ రూరల్ పోలీస్ స్టేషన్ వారు హెచ్చరించారు.

# పోలీస్ కంట్రోల్ రూమ్ హెడ్ కానిస్టేబుల్ తిరుపాలకు ఘన సన్మానం



**కర్నూలు క్రైమ్, ఆగస్టు 31, (సీమకిరణం న్యూస్):** కర్నూలు పోలీస్ కంట్రోల్ రూమ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన తిరుపాలు దంపతులను సోమవారం కర్నూలు ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ ఘనంగా సన్మానించారు. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కర్నూలు ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ తిరుపాలు దంపతులను శాలువాతో కప్పి, పూలమాలలు వేసి ఆత్మీయంగా సత్కరించారు. పోలీస్ శాఖలో ఆయన అందించిన సుదీర్ఘ సేవలను, విధి నిర్వహణలో ప్రదర్శించిన అంకితభావాన్ని ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం 1994--95 సివిల్ పోలీస్ బ్యాచ్‌కు చెందిన సహచరులు, బ్యాచ్ మిత్రులు తిరుపాలు దంపతులను ఘనంగా సన్మానించి ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. పదవీ విరమణ తర్వాత తిరుపాలు దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అత్యంత ఆత్మీయ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజుతో పాటు బ్యాచ్ మిత్రులు జావిద్, చంద్రకాంత్, సిద్దేశ్వర ప్రసాద్, ఖాజా, ఖాద్రి, ప్రసాద్ సింగ్, గోవిందు, అజ్మతుల్లా బేగ్, శ్రీనివాసులు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి

నార్లాపురంలో కొర్ర, అండు కొర్ర పంటలపై పొలంబడి కార్యక్రమం







**వెల్దుర్తి ఆగస్టు 31 (సీమ కిరణం న్యూస్ ):** కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం నార్లాపురం గ్రామం నందు కొర్ర మరియు అండు కొర్ర మీద రైతులతో పొలంబడి కార్యక్రమాన్ని భూమేశ్వర రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో భాగంగా రైతులతో కొర్ర పంటపై సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులు, మట్టి నమూనాల సేకరణ మరియు భూసార పరీక్షల ఆవశ్యకత గురించి, సేంద్రియ ఎరువుల వాడకం గురించి, భూమిలో నీటిని నిల్వ ఉంచుకొనే సామర్థ్యం, విత్తనశుద్ధి ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. రైతులతో బ్యాలెట్ బాక్స్ టెస్ట్ నిర్వహించి, ఏసా కార్యక్రమం చేయడం జరిగింది.ఎల్నినో ప్రభావము ఉన్నందునరైతులుప్రత్యామ్నాయ పంటలు అయిన కొర్ర, జొన్న, ఉలవలు, మినుములు, కుసుమలు, ప్రొద్దుతిరుగుడు వైపు మొగ్గుచూపాలని కోరడం జరిగింది.వెల్దుర్తిమండలవ్యవసాయ అధికారి, ఆర్,అక్బర్ బాషా సంధ్యా రాణి, ా జూా, ా ఖ ఇంచార్జి, ప్రమీల, శ్రీకాంత్ మరియు ఫ్రీూ - జజూా, శివ శంకర్ మరియు రైతులు పాల్గొన్నారు

# మృతుడి కుటుంబానికి జనసేన నాయకులు ఆర్థిక సాయం



**ప్యాపిలి ఆగస్టు 31(సీమ కిరణం న్యూస్) :** ప్యాపిలి మండలంలోని కలచట్ల గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన తప్పటి రాజు మృతి చెందాడు మృతిని కుటుంబాన్ని జనసేన నాయకులు పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుమారుడికి నగదు రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ పరిస్థితిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు క్రిష్టిపాడు చంద్ర, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే పోలీసుల ధ్యేయం

ఎస్సై నాగార్జున



**ప్యాపిలి ఆగస్టు 31 (సీమ కిరణం న్యూస్);** ప్రజల భద్రతే పోలీసుల ధ్యేయం అని ఎస్సై నాగార్జున అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వెంగళం పల్లె గ్రామంలో ఆదివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగార్జున గ్రామ ప్రజలకు సైబర్ మోసాలు, నకిలీ రుణాలు, రోడ్డు భద్రత, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ వినియోగం, మైనర్ డ్రైవింగ్, మహిళలపై జరిగే నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఎస్సై నాగార్జున మాట్లాడుతూ. అపరిచిత వ్యక్తులతో ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమానికి గ్రామ ప్రజలు సానుకూలంగా స్పందించి, పోలీసులకు సహకరిస్తామని తెలిపారు.

# విద్యార్థులకు ప్రేరణత్మక అవగాహన కార్యక్రమం




**డోన్ టౌన్, ఆగస్టు 31,(సీమ కిరణం న్యూస్):** డోన్ పట్టణంలోని నెహ్రూ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు ప్రేరణాత్మక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డోన్ రూరల్ ఎస్.ఐ మమతా విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మక సందేశం అందించారు. విద్యార్థి దశలో ఎలా మెలగాలి, మంచి,చెడు విషయాలను ఎలా గుర్తించాలి, తమ శక్తి సామర్థ్యాలను సద్వినియోగం చేసుకోవడం, క్రమశిక్షణతో లక్ష్య సాధన దిశగా ఎలా ముందుకు సాగాలి అనే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు బైరెడ్డి గంగిరెడ్డి, కార్యదర్శి బి.మల్లారెడ్డి మరియు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎస్.ఐ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

### లక్ష కోట్ల అవినీతి అన్న రేవంత్ రెడ్డి...

## అతనిని ఎందుకు అరెస్ట్ చేయడం లేదు?




మేఘా కృష్ణారెడ్డి ఇప్పుడు రేవంత్ రెడ్డికి బెస్ట్ ఫ్రెండ్ అయ్యాడని విమర్శ దమ్ముంటే కృష్ణారెడ్డిని అరెస్ట్ చేయాలని సవాల్అదానీ, అంబానీలను బిలియనీర్లుగా చేసింది కాంగ్రెస్సే అన్న పాల్కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని, సీబీఐ విచారణ జరిపించాలని గతంలో డిమాండ్ చేసిన రేవంత్ రెడ్డి... ముఖ్యమంత్రి అయ్యాక మేఘా కృష్ణారెడ్డిని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ప్రశ్నించారు. గురువారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది అయిందని... కానీ మేఘా కృష్ణారెడ్డి ఇప్పుడు సీఎంకు బెస్ట్ ఫ్రెండ్ అయ్యాడని ఆరోపించారు. కాంగ్రెస్ ఎప్పుడూ ద్వంద్వ విధానాలను పాటిస్తుందని విమర్శించారు.కాళేశ్వరం అవినీతిపై కాగ్ నివేదిక తేటతెల్లం చేసిందని, ఈ ప్రభుత్వానికి దమ్ముంటే కృష్ణారెడ్డిని అరెస్ట్ చేయాలని సవాల్ చేశారు. ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటేనే సత్వర న్యాయం జరుగుతుందని, కోర్టు విచారణలతో ఏళ్లు పడుతుందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను తాను కోర్టు ద్వారా నిలువరించానన్నారు. అవినీతి, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని తాను న్యాయ పోరాటం చేస్తున్నానన్నారు. ప్రజలు తన పోరాటానికి మద్దతు పలకాలన్నారు.

**అదానీ, అంబానీలను బిలియనీర్లుగా చేసింది కాంగ్రెస్సే**

అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ, రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీలను బిలియనీర్లుగా చేసిందే కాంగ్రెస్ పార్టీ అని కేఏ పాల్ విమర్శించారు. ఇప్పుడు అదే అదానీని అరెస్ట్ చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది కాంగ్రెస్ ద్వంద్వ విధానాలకు నిదర్శనమన్నారు.

### నోటిఫికేషన్ ఇవ్వకుండానే

## ఉద్యోగాలు ఇచ్చామని రేవంత్ రెడ్డి గోబెల్స్ ప్రచారం

నోటిఫికేషన్లు ఇవ్వకుండానే 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని గోబెల్స్ ప్రచారం ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి... ఇప్పుడు తొమ్మిది నెలలు శిక్షణ పూర్తి చేసుకొని విధుల్లో చేరబోతున్న 8,047 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలను కూడా తన ఖాతాలో వేసుకుంటాడేమోనని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన పోలీసు పరీక్షల్లో ఎంపికై, ఉద్యోగాలు పొంది తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకొని, 8,047 మంది పోలీస్ కానిస్టేబుళ్లు విధుల్లో చేరబోతున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. ఆ కానిస్టేబుళ్లకు హరీశ్ రావు శుభాకాంక్షలు చెప్పారు.నీతి, నిజాయతీలతో వ్యవహరిస్తూ, శాంతిభద్రతలు కాపాడడంలో నిమగ్నం కావాలని, ఉద్యోగ నిర్వహణలో రోల్ మోడల్గా నిలవాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు.

### హైకోర్టులో బీఆర్ఎస్కు భారీ ఊరట...

## పాలమూరు ధర్నాకు అనుమతి

ఈ నెల 25న తలపెట్టిన మహా ధర్నాకు హైకోర్టు అనుమతివెయ్యి మంది రైతులతో ధర్నాకు అనుమతించిన హైకోర్టు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజన, రైతు ధర్నా చేపట్టాలని బీఆర్ఎస్ నిర్ణయంతెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్కు భారీ ఊరట లభించింది. మహబూబాబాద్లో ఈ నెల 25న ఉదయం పది గంటలకు నిర్వహించ తలపెట్టిన మహా ధర్నాకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. వెయ్యి మంది రైతులతో ధర్నా నిర్వహించేందుకు బీఆర్ఎస్కు కోర్టు అనుమతించింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజన, రైతు ధర్నాను ఈరోజు (నేడు) చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. కానీ పోలీసులు అనుమతించలేదు. దీంతో ఈ నెల 25న చేపట్టాలని నిర్ణయించింది. ఈ గిరిజన, రైతు ధర్నాకు అనుమతి ఇవ్వాలని బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టులో ప్రతిపక్షానికి అనుకూలంగా తీర్పు వచ్చింది.

# వర్మపై మరో కేసు నమోదు

చంద్రబాబు, పవన్, లోకేశ్ ల మార్ఫింగ్ ఫొటోల కేసుకేసు నమోదు చేసిన రావికమతం పోలీసులు విచారణకు హాజరు కావాలంటూ నోటీసులుసినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు ఇబ్బందులు పెరుగుతున్నాయి. చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ ల మార్ఫింగ్ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, వారిని కించపరిచేలా కామెంట్లు చేసిన అంశంలో ఇప్పటికే ఆయనపై ప్రకాశం జిల్లాలో కేసు నమోదయింది. నవంబర్ 20న ఒంగోలు రూరల్ పీఎస్ లో విచారణకు రావాలని నోటీసులు ఇచ్చారు. అయితే, షూటింగ్ లో బిజీగా ఉన్నానని, విచారణకు హాజరు కావడానికి తనకు కొంత సమయం కావాలని వర్మ కోరారు. దీంతో నవంబర్ 25న విచారణకు హాజరు కావాలని నిన్న మరోసారి నోటీసులు ఇచ్చారు. మరోవైపు, ఆయనపై మరో కేసు కూడా నమోదయింది. అనకాపల్లి జిల్లా రావికమతం పోలీసులు వర్మపై కేసు నమోదు చేశారు. చంద్రబాబు, పవన్, లోకేశ్ లపై మార్ఫింగ్ ఫొటోలకు సంబంధించే ఈ కేసు కూడా నమోదయింది. ఈరోజు (21న) విచారణకు హాజరు కావాలంటూ రావికమతం పోలీసులు నోటీసులు ఇచ్చారు. అయితే విచారణకు హాజరయ్యేందుకు వర్మ మరో వారం రోజులు సమయం కోరినట్టు తెలుస్తోంది.

### లగచర్ల ఘటన.. పోలీసులపై

# హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్




హైదరాబాద్, నవంబర్ 21: లగచర్ల ఘటనలో పోలీసులపై హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా తన భర్త పట్నం నరేందర్ రెడ్డి అరెస్టు జరిగిందని పట్నం శృతి హైకోర్టులో పిటిషన్ ధాఖలు చేశారు. పోలీసులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని పిటిషన్లో పేర్కొన్నారు. ఒక వ్యక్తిని అరెస్టు చేసే సమయంలో అనుసరించాల్సిన నిబంధనలు పాటించలేదని పిటిషనర్ పేర్కొన్నారు. డీ.కే బసు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పిటిషన్లో శృతి పేర్కొన్నారు. ప్రతివాదులుగా ఐజీ వి.సత్యనారాయణ, వికారాబాద్ ఎస్పీ కె. నారాయణరెడ్డి, బొమ్మరాస్పేట ఇన్స్పెక్టర్ శ్రీధర్రెడ్డి, ఎస్సై మహమ్మద్ అబ్దుల్ రవూఫ్ పిటిషనర్ చేర్చారు. ప్రతివాదులుగా ఉన్న పోలీసులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలంటూ పట్నం శృతి కోరారు. ఈ పిటిషన్ను హైకోర్టు రేపు(శుక్రవారం) విచారించే అవకాశం కనిపిస్తోంది.కాగా.. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్పై దాడి ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ దాడిలో పాల్గొన్న నిందితుల్లో ఒకరు.. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్రెడ్డితో ఎక్కువసార్లు ఫోన్లో మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఈ కేసులో మాజీ ఎమ్మెల్యేను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్లోని కేబీఆర్ పార్క్లో మార్నింగ్ వాక్ చేస్తుండగా ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం చర్లపల్లి జైల్లో నరేందర్ రెడ్డి ఉన్నారు.అయితే అరెస్ట్ సమయంలో పోలీసులు కనీస నిబంధనలు పాటించలేదంటూ పట్నం నరేందర్ రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ను దాఖలు చేశారు. దీనిపై నిన్న(బుధవారం) వాదనలు ముగిశాయి. కాగా తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. నరేందర్ రెడ్డి తరపున గంఢ్ర మోహన్ రావు వాదనలు వినిపించారు. అరెస్టు సమయంలో పోలీసులు కనీస నిబంధనలు పాటించలేదని తెలిపారు. హత్యాయత్నం కేసు తప్ప మిగిలిన సెక్షన్లన్నీ 5 సంవత్సరాలలోపు శిక్ష పడేవే అని చెప్పారు. ఘటన జరిగిన రోజు సురేష్తో పట్నం నరేందర్ ఎన్ని కాల్స్ మాట్లాడారు హైకోర్ట్ ప్రశ్నించింది. 71 డేస్లో 84 కాల్స్ ఉన్నందుకు అరెస్ట్ చేయడం సరికాదని న్యాయవాది తెలిపారు. అరెస్టు విషయాన్ని కనీసం కుటుంబసభ్యులకు కూడా చెప్పలేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పులను కింది కోర్ట్ కనీసం పరిగణలోకి తీసుకోలేదని.. అరెస్ట్ గ్రౌండ్స్ను చూడకుండానే పట్నం నరేందర్ రెడ్డికి రిమాండ్ విధించారని తెలిపారు. పట్నం నరేందర్ ది అక్రమ అరెస్ట్ అని న్యాయవాది వాదించారు. ఎక్కడ కూడా పోలీసులు లీగల్ ప్రొసీడింగ్స్ ఫాలో కాలేదన్నారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా మాజీ ఎమ్మెల్యేను అరెస్ట్ చేశారన్నారు. 11వ తేదీ సంఘటన జరిగినప్పుడు నరేందర్ రెడ్డి అక్కడ లేరని.. సురేష్ అనే నిందితుడి కాల్ డేటా ఆధారంగా అరెస్ట్ చేశామని పోలీసులు చెబుతున్నారన్నారు. 11వ తేదీ కేవలం ఒకే ఒక సారి సురేష్తో నరేందర్ రెడ్డి ఫోన్లో మాట్లాడినట్లు చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పులను ఉల్లంఘించారని పిటిషనర్ తరపు న్యాయవాది గంఢ్ర మోహన్ రావు వాదనలు వినిపించారు.

**సీఎం రేవంత్ సంచలన నిర్ణయం**

లగచర్ల ఘటనలో ప్రభుత్వాన్ని అస్థిర పరించేందుకు కుట్ర చేశారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. కలెక్టర్ మీద, అధికారుల మీద దాడులు చేయించారని.. అన్నింటికీ ప్రధాన సూత్రధారి పట్నం నరేందర్ రెడ్డి అని వాదించారు. నరేందర్ రెడ్డికి సంబంధించి ఎలాంటి ఆధారాలు ఉన్నాయని హైకోర్టు ప్రశ్నించింది. తన అనుచరులతో కలిసి స్కెచ్ వేశారని కోర్టుకు పీపీ తెలియజేశారు. ఎవరు అనుచరులు.. అతని హోదా ఏంటి అని ధర్మాసనం మరో ప్రశ్న వేయగా.. సురేష్ అనే వ్యక్తి పట్నం నరేందర్ రెడ్డి ప్రధాన అనుచరుడు అని తెలిపారు. సంఘటన జరిగిన రోజు సురేష్ ... నరేందర్ కాల్స్ మాట్లాడుకున్నారని చెప్పారు. అరెస్ట్ సందర్భంగా ఎలాంటి నియమాలు పాటించారని పీపీని హైకోర్టు అడిగింది. కేబీఆర్ పార్క్లో ఒక మాజీ ఎమ్మెల్యేను ఎలా అరెస్ట్ చేస్తారని ధర్మాసనం ప్రశ్నించగా... కేబీఆర్ పార్క్లో అరెస్ట్ చేయలేదని తన ఇంట్లో అరెస్ట్ చేశామని కోర్టుకు పీపీ తెలిపారు. వాదనలు ముగిసిన అనంతరం తీర్పును హైకోర్టు ధర్మాసనం రిజర్వ్ చేసింది.

# ప్రాణంపోతోంది రక్షించండని వేడుకున్నా.. కనికరించని జనం



హైదరాబాద్, నవంబర్ 21: "మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు" అంటూ ఓ రచయిత రాసిన ఈ పాట అక్షరాలా నిజమయ్యేలా కొన్ని సంఘటనలు సమాజంలో చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో బాధితులకు అండగా ఉండాల్సింది పోయి కొందరు చూసీ చూడనట్టుగా వ్యవహరించడంతో నిండు ప్రాణాలు బలైపోతున్నాయి. వారి ప్రాణాలు రక్షించడంలో సహాయం చేయకపోగా ఫోటోలు, వీడియోల పిచ్చితో మానవత్వం మంటగలిసేలా ప్రవర్తిస్తున్నారు కొందరు .ప్రాణంపోతోంది కాపాడండి మహాప్రభో అన్నా కూడా జనం చూస్తూ ఉన్నారే ఎవ్వరూ ముందుకు రాని పరిస్థితి. తాజాగా కీసర ఔటర్ రింగ్ రోడ్డు వద్ద జరిగి ఓ విషాద ఘటన అందరినీ కలిచివేసింది. తన ప్రాణాలు రక్షించాలని కోరుకున్నా.. చుట్టూ ఉన్న జనం చూస్తూ ఉన్నారే తప్ప ముందుకు రాలేదు. పైగా తామేదో మంచి పనిచేస్తున్నట్లు బాధతో విలవిలలాడుతున్న బాధితుడి ఫోటోలు, వీడియోలు తీయడంలో బీజీ అయ్యారు. దీంతో చూస్తూ ఉండగానే అతడి ప్రాణం గాల్లో కలిసిపోయింది.

**అసలేం జరిగిందంటే...**

కీసర ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో రాంపల్లి చౌరస్తా వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. వరంగల్కు చెందిన ఎలందర్ అనే వ్యక్తి స్కూటీపై వెళ్తుండగా రివర్స్లో వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో స్కూటీపై నుంచి ఎలందర్ కింద పడటంతో అతడి రెండు కాళ్లపై నుంచి లారీ వెళ్లింది. ప్రమాదంలో ఎలందర్ రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. రక్తపు మడుగులో ఎలందర్ నొప్పితో విలవిలలాడి పోయాడు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడి చుట్టుపక్కల జనం ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే నొప్పితో బాధపడుతున్న వ్యక్తిని ఏమాత్రం పట్టించుకోకుండా తమ పని తాము చేసుకుంటూ పోయారు. ప్రాణంపోతోంది రక్షించండి అని వేడుకున్నా కూడా వీడియో, ఫోటోలు తీసుకుంటూ జనం.. అతడికి సహాయం చేయలేదు. దీంతో జనాల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైంది .నొప్పితో అల్లాడుతూ తనను కాపాడమని బాధితుడు వేడుకున్నాడు. అయినప్పటికీ జనం కనికరించకుండా ఫోటోలు, వీడియోలు తీసుకుంటూ ఉండిపోయారు. 108 వెహికల్ వచ్చే వరకు కూడా జనం ఫోటోలు, వీడియోలతో కాలక్షేపం చేశారు. అంబులెన్స్ వచ్చి ఎలందర్ను ఆస్పత్రికి తరలించేలోపే ఘోరం జరిగిపోయింది. రోడ్డు ప్రమాదం జరిగి చాలా సేపు అవడంతో పాటు, సరైన సమయానికి ఆస్పత్రికి తరలించకపోవడంతో ఎలందర్ మార్గమధ్యలోనే ప్రాణాలు విడిచారు. మృతునికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. అయితే ఈ ఘటనకు సంబంధించి వీడియోను పలువురు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అది కాస్తా వైరల్గా మారింది. ఈ హృదయ విదారకర ఘటనను చూసి పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాద బాధితుడిని పట్టించు కోకుండా వీడియోలు తీసిన జనంపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# నేను కూడా రాజీనామా చేసి వెళ్ళాలనుకున్నా

హైదరాబాద్, నవంబర్ 21: తెలంగాణ వ్యాప్తంగా 8,047 మంది పోలీస్ కానిస్టేబుల్స్ శిక్షణ పొందారని.. ఇందులో 4,100 సివిల్, 3,685 మంది ఏఆర్ 2,028 కమ్యూనికేషన్స్, 18 మంది పోలీస్ ట్రాన్స్ పోర్ట్ ఉన్నారని సీపీ సీవీ ఆనంద్ (%జూ జ౦ ాూఋఅ౦%) తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఇందులో నుంచి హైదరాబాద్ పోలీస్ శాఖకు 1,128 మందిని ట్రైనింగ్ కోసం కేటాయించినట్లు చెప్పారు. ఇప్పుడు 747 మంది దీక్షత్ పాసింగ్ అవుట్ పరేడ్ చేశారన్నారు. 3,081 మంది మహిళల కానిస్టేబుల్స్ పోలీస్ శిక్షణ పొందారన్నారు."1992లో నేను ఐపీఎస్ శిక్షణ పొందాను పాసింగ్ అవుట్ పరేడ్ జరిగింది. అప్పుడు 80 మంది ట్రైనీ ఐపీఎస్లు పాల్గొన్నాం. వర్షం పడుతున్నా పరేడ్ పూర్తి చేశాం" అంటూ ఆనాటి విషయాలను గుర్తుచేశారు సీపీ. శిక్షణ పొంది పోలీస్ శాఖలో 35 ఏళ్లు గడపబోతున్నారని... శిక్షణ పొందిన వారు అకుంటిత దీక్షతో పని చేయాలని సూచించారు. పోలీసులు రాజ్యాంగానికి విధేయత చూపాలన్నారు. పోలీసులు నిజాయితీగా, న్యాయంగా పనిచేయాలని తెలిపారు. ప్రజల మాన, ప్రాణాలు కాపాడడంలో కర్తవ్యం నెరవేర్చాలని స్పష్టం చేశారు. పోలీస్ డ్యూటీ అంటే ఒత్తిడితో కూడుకున్నదని ఆయన తెలిపారు.

పోలీసులకు ముఖ్య సూచన...

అలాగే పోలీసులకు సీపీ ముఖ్య సూచన చేశారు. పోలీసులు తాగుడుకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. యువ పోలీసులు ఫిజికల్ ఫిట్నెస్గా ఉండాలని.. దేనికి ఏ వ్యసనానికి కూడా లొంగకూడదని.. బానిస కాకూడదని తెలిపారు. "నా 33 ఏళ్ల పోలీస్ సర్వీస్లో 75 కేజీల మధ్యలో ఉన్నాను. నేను చాలా ఫిట్గా ఉన్నాను. 30 ఏళ్ల క్రితం నా ఐపీఎస్ పాసింగ్ అవుట్ పరేడ్లో వేసుకున్న పోలీస్ డ్రెస్ ఇప్పుడు కూడా వేసుకోగలను. మీరు శిక్షణ పొందిన పేట్లబురుజు ఆర్మ్ రిజర్వ్ ఇన్చార్జ్ డీసీపీ దక్షిణామూర్తిని చూడండి ఎంత ఫిట్గా ఉన్నారో. ఫిట్గా ఉన్న వారిని ఆదర్శంగా తీసుకోండి. పోలీసుల జీతాల విషయంలో ప్రభుత్వం ఎక్కువగా పెంచదు. పోలీసులు అవినీతికి పాల్పడకూడదు. ఐపీఎస్ లాంటి ఉద్యోగంలో కూడా జీతాలు అంతంత మాత్రమే. పోలీస్ శాఖలో మెల్లమెల్లగా జీతాలు పెరుగుతూనే ఉంటాయి. పోలీస్ ఉద్యోగం అంటే టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లాంటిది. ఒక పరిస్థితిలో నేను కూడా రాజీనామా చేసి వెళ్ళలనుకున్నా. శిక్షణ తీసుకున్నవారు మీ సేవల ద్వారా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురండి" అంటూ సీపీ ఆనంద్ పేర్కొన్నారు.




తెలంగాణలో స్టైపెండరీ ట్రైనీ కానిస్టేబుల్స్ 9 నెలల శిక్షణ పూర్తి..


కాగా.. తెలంగాణా పోలీస్ అకాడమీలో కానిస్టేబుల్స్ నాలుగవ పాసింగ్ ఔట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీజీపీ జితేందర్, పోలీసులు ఉన్నతాధికారులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఆర్, సివిల్, ఎస్ఏఆర్సీపీఎల్, ఐటీ, సీపీఎన్పీటీఓ విభాగాలకు చెందిన 8,047 మంది స్టైపెండరీ ట్రైనీ కానిస్టేబుల్స్ శిక్షణ విజయవంతమైంది. ఫిబ్రవరి21, 2024లో స్టైపెండరీ ట్రైనీ కానిస్టేబుల్స్ శిక్షణ మొదలైంది. రాష్ట్రంలో మొత్తం 19 ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్లో శిక్షణ జరిగింది. కానిస్టేబుల్ శిక్షణ పొందిన వారిలో 5709 పురుషులు, 2338 మహిళ అభ్యర్థులు ఉన్నారు. ట్రైనీ కానిస్టేబుల్స్కు సమగ్రంగా అన్ని అంశాలపై శిక్షణ పూర్తి అయ్యింది. సివిల్, క్రిమినల్, సైబర్ కేసులు, ఎన్డీపీఎస్ యాక్ట్, క్రైమ్, సెల్ఫ్ డిఫెన్స్ ఇలా చాలా అంశాలపై ట్రైనింగ్ జరిగింది. కానిస్టేబుల్స్లో గ్రాడ్యుయేషన్ 5470 , పోస్ట్ గ్రాడ్యుయేషన్ 1361 చదివిన వారు ఉన్నారు. ఇందులో టెక్నికల్1755, నాన్ టెక్నికల్ 5505, లా పూర్తి చేసుకున్న వారు 15 మంది ఉన్నారు. నేడు పాసింగ్ ఔట్ పరేడ్ తరువాత తెలంగాణ పౌరుల సేవలో 8,047 మంది కానిస్టేబుల్స్ పాల్గొననున్నారు.

# కొండ సురేఖ వ్యాఖ్యలపై నాగార్జున కుటుంబం క్షోభించింది

హైదరాబాద్: అక్కినేని నాగచైతన్య , సమంత విడిపోవడానికి మాజీ మంత్రి కేటీఆర్ కారణమంటూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ఎంతటి దుమారాన్ని రేపాయో అందరికీ తెలిసిందే. మంత్రి వ్యాఖ్యలను అక్కినేని నాగార్జున తీవ్రంగా ఖండించారు. సినీ ఇండస్ట్రీ మొత్తం మంత్రి వ్యాఖ్యలను తప్పుబట్టింది. చివరకు కొండా సురేఖ వ్యాఖ్యలపై నాంపల్లి కోర్టును ఆశ్రయించారు నాగార్జున. క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రోజు (గురువారం) నాంపల్లి కోర్టులో పిటిషన్ విచారణ జరిగింది. ప్రొసిజర్ ప్రకారం పిటిషనర్ వాంగ్మూలాన్ని న్యాయస్థానం రికార్డు చేసింది. నాగార్జున స్టేట్మెంట్ తర్వాత సాక్షుల స్టేట్మెంట్లను రికార్డ్ చేసింది.అయితే.. మంత్రి కొండా సురేఖపై నాగార్జున పరువు నష్ట దావా వేశారు. పరువు నష్ట దావాలో ఇప్పటికే మంత్రి కొండా సురేఖ కౌంటర్ దాఖలు చేశారు. నాంపల్లి స్పెషల్ కోర్టులో న్యాయవాది గురుమిత్ సింగ్ కౌంటర్ దాఖలు చేశారు. కౌంటర్పై కొండా సురేఖ తరుపు న్యాయవాది ఈరోజు వాదనలు వినిపించారు.

**నాగార్జున కుటుంబం కుంగిపోయింది..**

"కొండ సురేఖ నాగార్జునపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసింది. ఆ తర్వాత ట్విట్టర్లో క్షమాపణ కోరుతూ పోస్ట్ చేసింది. ట్విట్టర్లో మంత్రి కొండా సురేఖ పెట్టిన పోస్ట్ను కోర్ట్ ముందు నాగార్జున తరుపు న్యాయవాది అశోక్ రెడ్డి చదివి వినిపించారు. నా వ్యాఖ్యల పట్ల మీరు కానీ, మీ అభిమానులు కానీ మనస్తాపానికి గురైనట్లయితే బేషరతుగా నా వ్యాఖ్యలను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నాను, అన్యద భావించవద్దని కొండా సురేఖ ట్విట్ చేసింది. బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి ఇలాంటి కామెంట్స్ చేయడం సరైంది కాదు. కచ్చితంగా కొండా సురేఖ క్రిమినల్ చర్యలకు అర్హురాలు. ఈ కామెంట్స్తో నాగార్జున కుటుంబం మానసికంగా ఎంతో





కుంగిపోయారు" అని నాగార్జున తరపు న్యాయవాది అశోక్ రెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు.

**నాగార్జున ఏమన్నారంటే..**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్పై ఆరోపణలు గుప్పిస్తూ.. అక్కినేని కుటుంబాన్ని ప్రస్తావించి మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై హీరో అక్కినేని నాగార్జున స్పందించారు. కొండా సురేఖ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని ప్రకటించారు. "రాజకీయాలకు దూరంగా ఉండే సినీ ప్రముఖుల జీవితాలను, మీ ప్రత్యర్థుల్ని విమర్శించేందుకు వాడుకోకండి. దయచేసి సాటి మనుషుల వ్యక్తిగత విషయాలను గౌరవించండి. బాధ్యత కలిగిన పదవిలో ఉన్న మహిళగా మీరు చేసిన వ్యాఖ్యలు, మా కుటుంబం పట్ల మీరు చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధం, అబద్ధం. తక్షణమే మీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను" అని నాగార్జున అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. బాధ్యతగల మంత్రి పదవిలో ఉండి.. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధారమైన, అవాస్తవ వ్యాఖ్యలు చేసిన ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్న కొండా సేరేఖ**

మరోవైపు.. తన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం చెలరేగిన నేపథ్యంలో.. ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు మంత్రి కొండా సురేఖ ప్రకటించిన విషయం తెలిసిందే. "అనుకోని సందర్భంలో.. అనుకోకుండా ఓ కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా. కేటీఆర్ నన్ను కించపరిచే విధంగా మాట్లాడారు. ఆ మాటలతో వేదనకు గురై ఆయన గురించి వ్యాఖ్యలు చేసే క్రమంలో అనుకోకుండా నాగార్జున కుటుంబం గురించి మాట్లాడా. ఆ వ్యాఖ్యలను నేను వెనక్కి తీసుకుంటున్నా. కానీ కేటీఆర్పై చేసిన వ్యాఖ్యల విషయంలో మాత్రం వెనక్కు తగ్గేది లేదు" అని కొండా సురేఖ స్పష్టం చేశారు.తాను వ్యాఖ్యలు చేసిన తర్వాత ఎక్స్, ఇతర సామాజిక మాధ్యమాల్లో ఆ కుటుంబం ఆవేదనతో చేసిన పోస్టులు చూసి తనకు బాధ అనిపించిందని, ఆ కుటుంబాన్ని తన వాఖ్యలు నొప్పించాయని తెలిసి బాధ పడ్డానని పేర్కొన్నారు. తాను పడిన బాధ వాళ్లు పడకూడదనే ఉద్దేశంతో.. తన వాఖ్యలను వెనక్కి తీసుకుంటూ తాను కూడా ఎక్స్లో పోస్టు చేశానని తెలిపారు. కేటీఆర్ తనను మరింత రెచ్చగొడుతున్నారని ఆమె మండిపడ్డారు. "కేటీఆర్కు నేను క్షమాపణ చెప్పడమేంటని.. ఆయనే నాకు క్షమాపణలు చెప్పాలి" అని డిమాండ్ చేశారు. దొంగే 'దొంగా దొంగా' అన్నట్టుగా కేటీఆర్ ప్రవర్తన ఉందని.. ఆయన తనపై పెట్టించిన పోస్టులన్నింటినీ తొలగించాలని దుయ్యబట్టారు. తన కంటే ముందు.. మంత్రి సీతక్కపై ఇంకా ఘోరంగా ట్రోల్ చేశారని ఆవేదన వెలిబుచ్చారు. మహిళలను ట్రోల్ చెయ్యొద్దని బీఆర్ఎస్కు హితవు పలికిన ఆమె.. "కేటీఆర్ నీకు మహిళలు పనికిమాలిన వాళ్లలా కనిపిస్తున్నారా? మీ కుటుంబ సభ్యులే మహిళలా? నీ నోరు ఏ యాసిడ్తో కడగాలి?" అంటూ నిప్పులు చెరిగారు.

**వారిని కేటీఆర్ దుబాయ్లో దాచి పెట్టారు..**

తనను ట్రోల్ చేసినవారిని కేటీఆర్ దుబాయ్లో దాచి పెట్టారని ఆరోపించారు. వెంటనే వారిని తీసుకొచ్చి అప్పగించాలని డిమాండ్ చేశారు. సినీ పెద్దల స్పందన వెనుక బీఆర్ఎస్ నేతలు ఉన్నారో, లేదో తనకు తెలియదన్నారు. కేటీఆర్ ఇచ్చిన నోటీసులను తాను లీగల్గా ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతండడంతో పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్.. దీనిపై వివరణ ఇవ్వాలని సురేఖకు సూచించారు. దీంతో తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుంటున్నట్లు కొండా సురేఖ ట్వీట్ చేశారు. "నా వ్యాఖ్యల ఉద్దేశం మహిళల పట్ల ఒక నాయకుడి ధోరణిని ప్రశ్నించడమే తప్పు.. సమంతా, మీ మనోభావాలను దెబ్బతీయడం కాదు" అని స్పష్టం చేశారు. "స్వయం శక్తితో మీరు ఎదిగిన తీరు నాకు కేవలం అభిమానమే కాదు.. ఆదర్శం కూడా" అని మంత్రి కొండా సురేఖ వెల్లడించారు.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com